

# పసిడిమనసులు - షర్మిల



## నెలనెలా పసిడిమనసులు చెప్పే మనసైన కథలు..!

# చిట్టి అమ్మలు

"బాబాయి బయల్దేరి వస్తున్నాడంట " అని నాయనమ్మ చెప్పినప్పటినుంచి నాకు సంబరంగా వుంది. మా బాబాయి నాగపూర్లో బీఎస్సీ చదువుతున్నాడు. బాబాయ్ కి నేనంటే ముద్దు. నాకు చిన్నప్పుడు మంచి బట్టలు వేసి ముస్తాబు చేసే వాడంట. ఇంట్లో ఒక మేనత్తో పిన్నో వుంటే పసిపిల్లల్ని ఎట్లా పెంచుతారో మా బాబాయి అట్లా పెంచాడు. నా ముద్దు మురిపాలన్నీ అమా, నాన్నలకి ఉత్తరాల్లో వివరంగా రాసి పంపేవాడంట. నేను మాట్లాడిన ముద్దు మాటలు మా నాన్న కన్నా బాబాయికే తెలుసు. నన్ను ఎత్తుకుని "చిట్టి అమ్మలూ !చిన్ని నాన్నలూ !!"అని సినిమాపాట పాడేవాడు.

బాబాయి రానే వచ్చాడు. వచ్చేటప్పుడు బుట్టడు కమలాలు తెచ్చాడు . అవి ఎంత తియ్యగా వున్నాయో.

“బాబాయి! నీకు పెళ్లి చూపులంటగా?” ఆరిందాలాగా అడిగాను.

" అవును తల్లీ !నువ్వుకూడా నాతో వస్తావుగా నీకు నచ్చితేనే చేసుకుంటా సరేనా? " అన్నాడు.

పెళ్లి చూపులు గన్నవరంలో ఏరోడ్రోం ఆఫీసర్గా చేసే మా మవయ్యగారి ఇంట్లో పెట్టారు. మా వూరినుంచి నేను తాత, నాయనమ్మ, బాబాయి, నేనూ బయల్దేరాం. బెజవాడ బస్టాండ్లో దిగాం . అక్కడ కొట్లో కోకో కోలా అని రాసి వున్న డ్రింకు సీసాలు చూసి

" అది కొనిస్తావా ,లేదా " అని వెంటపడ్డాను.

“నువ్వు మొత్తం తాగుతానంటేనే కొంటా”నంటూ షరతు పెట్టాడు.

సరే అని నోట్లో పెట్టుకుంటే ఆ ఘాటు నాకు అసలు నచ్చలా రెండుగుక్కలు ఎట్టాగో ఎక్కించా , పారబోద్దామంటే బాబాయి నన్నే చూస్తున్నాడు .

చివరికి " నాకొద్దు బాబాయ్ " అని నసగడం మొదలెట్టా.

" చంపుతా ! తాగు " అనడంతో ఏడుపు లంకించుకున్నా .

మొత్తానికి గన్నవరం చేరాం. మర్నాడే పెళ్లిచూపులు. పిన్ని , వాళ్ల అక్క, నాన్నగారూ వచ్చారు. పిన్ని వాళ్ల నాన్నగారు వాళ్లు మా నాయనమ్మకి చుట్టాలంట. మా నాయనమ్మ చుట్టారికాల్లోకి వెళ్తే మన లోకంలో వుండదు. నేను మాత్రం నోరు, కళ్లు అప్పజెప్పి మా పిన్నినే చూస్తున్నా. మా బాబాయి సంగతేమో గానీ పిల్ల నాకు నచ్చింది. మా పిన్నిది పెద్ద జెడ . " పిల్ల రంగు తక్కువ " అని ఎవరో అనబోతే మా తాత వూరుకోలేదు. " మంచిమనసు వుండాలి, కుటుంబం మంచిదయితే చాలు " అన్నారు.

"చిట్టెమ్మా ! తల్లి లేని పిల్లని కడుపులో పెట్టుకుని చూస్తావని నీ ఇంట్లో పడేద్దామనుకుంటున్నా " అంటా నాయనమ్మ చెయ్యి పట్టుకున్నారు పిన్ని నాన్నగారు.

" అన్నయ్యా ! మా పిల్లే ఇక బెంగ పెట్టుకోవద్ద"ని అభయమిచ్చేసింది. ఇక పెళ్లి కూడా మా ఇంటిదగ్గరే చేద్దామనుకున్నారు.

ఇక చూస్కోండి నాకు సందడే సందడి. ఊరు వెళ్లింది మొదలు మా పిన్ని గురించి చాటింపు మొదలెట్టాను. "మీ అమ్మ బాగుంటుందా ! పిన్నా !?" అని అడిగితే " మా పిన్నే" అని చెప్పేదాన్ని. కొత్త పిన్ని మోజు మరి.

పెళ్లి రోజు రానే వచ్చింది. వంటవాళ్లు, పందిళ్లు ,చుట్టాలు భలే వుంది. పిన్ని వాళ్లకి మా వూరి షావుకారి గారింట్లో విడిది ఇచ్చారు. పిన్ని తప్ప అందరూ భోజనాలకు వచ్చారు. పిన్నికి భోజనం క్యారేజీ ఎవరితోనో పంపించబోతుంటే నేనే తీసుకెళ్తానని పట్టుబట్టి కిందా మీదపడి మోసుకెళ్లాను.

పెళ్లి అయ్యింది. పిన్ని మా ఇంటికి వచ్చేసింది. నేను పిన్నికి బాగా చేరువై పోయాను. మా పిన్నికూడా బీఎస్సీ చదివింది. నాకు లెక్కలు చెప్పడం, జెడలేయడం నా కబుర్లు వినడం చేసేది. మా బాబాయి ఉద్యోగం కోసం చూస్తున్నాడని ఉద్యోగం వస్తే వెళ్లిపోతారని నాయనమ్మ చెప్పింది. కొన్నాళ్లకి విశాఖపట్నంలో బాబాయికి ఉద్యోగం వచ్చింది. అక్కడికి వెళ్లడానికి సామాన్లు సర్దుతుంటే నేను వరండాలో బల్లమీద ఒక్కదాన్నే కూర్చున్నా.

వాళ్లు వెళ్లే రోజు రానే వచ్చింది, నేను బిక్కమోహం వేసుకుని వుండడం చూసి బాబాయ్ అన్నాడు

"అమ్మడూ ! నువ్వుకూడా సెలవల్లో విశాఖపట్నం వద్దుగాన్లే " అన్నాడు.

వాళ్లు వెళ్లిపోయిన రోజు నుంచి అనవసరంగా అన్నింటికీ కారణంలేకుండా ఏడ్చేదాన్ని. ఈ మధ్య ప్రతి విషయానికీ అమ్మడు ఎందుకో ఏడుస్తా వుంటాందని ఇంట్లో వాళ్లు అనుకున్నారు.

వాళ్లు వెళ్లాక ఓ రోజు సాయత్రం నాయనమ్మ అంది " ఏంటో ఇల్లు బోసి పోయినట్టుంది " అని .

“ నాయనమ్మా వాళ్లకి ఇల్లే బోసిపోయినట్టుందేమో ! నిజానికి నాకు మనసు కూడా బోసిపోయింది”

*(వచ్చేనెల మరో పసిడిమనసు కథ)*

COMMENTS